రామయ్య సేవలో త్రిదండి దేవానాథ రామానుజ జీయర్

వేద పండితులు మురళీ కృష్ణమాచార్యుల వారికి తాంబూలం అందజేస్తున్న రామానుజ జీయర్ స్వామి

భద్రాచలం, మే 17: భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని త్రిదండి దేవానాథ రామానుజ జీయర్ స్వామివారు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని ఆయన.. అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 17: భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా అంతరాలయంలోని మూలవరులకు బెంగళూరు భక్తులు రూ.5 కోట్లతో చేయించిన సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. ఈ ప్రత్యేక కవచాలంకరణలో సీతారాములు మరింత రమణీయంగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచిన అర్చకులు.. స్వామివారికి సుప్రభాతం, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం తదితర నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు: తహసీల్దార్

లారీలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ముజాహిద్

బూర్గంపహాడ్, మే 17: మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ముజాహిద్ హెచ్చరించారు. మండలంలోని మోరంపల్లి బంజర్‌లో మణుగూరు వైపు నుంచి మహబూబాబాద్‌కు వెళ్తున్న ఇసుక లారీలను శుక్రవారం ఆపి తనిఖీలు చేపట్టారు. అనుమతి పత్రాలు లేకపోతే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మండలంలో ఇప్పటికే పలు అనధికార ర్యాంపులను సీజ్‌చేశామని, తాళ్లగొమ్మూరు, సారపాక, నాగినేనిప్రోలు రెడ్డిపాలెంల్లోని నాలుగు ఇసుక నిల్వలను సీజ్ చేశామని వివరించారు. ఆర్ఐ-2 నర్సింహారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

చుంచుపల్లి, మే 17: మండలంలోని రుద్రంపూర్ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల కూలీలకు తిలక్ నగర్ మాజీ వార్డు మెంబర్ శివకుమార్ శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున దాదాపు 150 మంది కూలీలకు సొంత ఖర్చులతో మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

మొర్రేడువాగులోకి కొత్త నీరు

మొర్రేడువాగులో ప్రవహిస్తున్న వరద

లక్ష్మీదేవిపల్లి, మే 17 : మండల కేంద్రంలోని మొర్రేడు వాగులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వాగులో నీరు లేక ఎండిపోయింది. అయితే మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వాగులోకి కొత్తనీరు వచ్చి చేరింది. మొర్రేడు వాగులోకి వరద చేరడంతో జనం ఆసక్తిగా తిలకిస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, **BODDU ANJANEE DEVI** CHANGED MY NAME AS **BODDU ANJANI DEVI,** W/o. BODDU VENU PRASAD, R/o. H.NO: 4-2-14/0, SCB NAGAR, RAMAVARAM KOTHAGUDEM-507 118, BK DIST. KMM-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పైపుల చోరీపై కేసు నమోదు

పాల్వంచ రూరల్, మే 17 : మండలంలోని సూరారం యాష్ పాండ్ నుంచి గ్యాస్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి దొంగిలించారని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16వ తేదీన సూరారం సమీపంలోని యాష్ పాండ్ వద్ద పైప్‌లైన్లు కొంతమేరకు మాయమైన విషయాన్ని కేటీపీఎస్ ఏఈ దేశబోయిన రామారావు గుర్తించారు. ఈ పైపులు దాదాపు 30మీటర్ల పొడవు ఉంటాయని, వీటి విలువ రూ.80 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

అక్రమ కట్టడానికి అడ్డేది..!

డ్రైనేజీ పక్కనే కట్టిన అక్రమ నిర్మాణం

నిర్మాణం వెనుక వేసిన బోరు

కొత్తగూడెం అర్బన్, మే 17: కొత్తగూడెం పట్టణంలోని 24వ వార్డు కూలీ లైన్‌లో మున్సిపల్ అనుమతి లేకుండానే స్థానిక కాంగ్రెస్ నాయకుడు డ్రైనేజీ పక్కన అక్రమ నిర్మాణం చేపట్టారు. గత కొన్నిరోజులుగా నిర్మాణం జరుగుతుండగా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీని ఆనుకొని అక్రమంగా బోరు సైతం వేశాడు. ఇదేమని స్థానికులు అడిగితే మంచినీటి ప్లాంట్ పెడుతున్నట్లు చెప్పుకొచ్చాడు. పాత బస్ డిపో నుంచి నేరుగా 60 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ నిబంధనలు పట్టించుకోకుండా రోడ్డు పక్కనే డ్రైనేజీని ఆనుకొని నిర్మాణం చేపట్టి తన పలుకుబడితో స్థానికులను బెంబెలెత్తిస్తున్నాడు. మంచినీటిని అందిస్తాననే పేరు తో ఇక్కడ నిర్మాణం చేపట్టి క్రమంగా ఈ స్థలాన్ని మొత్తం అక్రమించాలనే ఉద్దేశంతోనే కార్యాచరణ మొదలుపెట్టారని దీనిని ప్రారంభంలోనే నిలువరించకపోతే ఈ స్థలం అంతా కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. 1996లో ఇదే ప్రదేశంలో మంచినీటి కోసం మున్సిపల్ సిబ్బంది బోరు వేసినప్పటికీ డ్రైనేజీ పక్కన ఉండడంతో కలుషిత నీరు రావడంతో ఈ నీరు తాగితే అనారోగ్యం బారినపడతారని చెప్పడంతో అప్పటికప్పుడు దానిని పూడ్చివేశారు. మళ్లీ ఇప్పుడు ఇదే ప్రదేశంలో బోరు వేసి, అక్రమ నిర్మాణం చేపట్టారు. దీనిపై పలుమార్లు బీఆర్ఎస్ నాయకురాలు వేముల లక్ష్మీబాయి, స్థానిక ప్రజలు ఫిర్యాదు చేయడంతో పాక్షికంగా నిలిపివేశారు. ఈ విషయంపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిని వివరణ కోరగా ఆ నిర్మాణానికి అనుమతి లేదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు

భద్రాచలం : ఎమ్మెల్యే వెంకట్రావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బూర్గంపహాడ్ : అన్నదానంలో భక్తులు

పాల్వంచ రూరల్ : ఆరాధన మహోత్సవం

జూలూరుపాడు, మే 17 : మండలంలోని కాకర్ల, పాపకొల్లు గ్రామాల్లో శ్రీమధ్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయాల వద్ద ఆరాధనా మహోత్సవాలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

పాల్వంచ రూరల్, మే 17: మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) విరాట్‌నగర్‌లోని స్వామివారి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు పెద్దోజు నాగాచారి పూజలు నిర్వహించారు. బండారు సత్యనారాయణ, వైకుంఠనాథ్, వీరాచారి, బ్రహ్మారావు, కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భద్రాచలం, మే 17: పట్టణంలోని గోల్డ్‌స్మిత్ కాలనీలో ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారిని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఆరాధన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు.

బూర్గంపహాడ్, మే 17: బూర్గంపహాడ్‌లోని శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారి ఆరాధన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కోటేశ్వరచారి, కృష్ణమాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

టెన్త్ బ్యాచ్‌మేట్లకు క్లాస్‌మేట్ల చేయూత

దుమ్ముగూడెం : స్నేహితునికి సాయం అందిస్తున్న మిత్రులు

సారపాక : ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

దుమ్ముగూడెం/ సారపాక, మే 17: దుమ్ముగూడెం, బూర్గంపహాడ్ మండలాల టెన్త్ బ్యాచ్ క్లాస్‌మేట్లు.. ఆపదలో ఉన్న తమ మిత్రులకు చేయూతనందించి ఆసరాగా నిలిచారు. దుమ్ముగూడెం మండలం రేగుంట గ్రామానికి చెందిన పాయం దుర్గారావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా వైద్యులు కంటికి ఆపరేషన్ చేయాలని తేల్చారు. కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో 2008-09లో అతడి టెన్త్ చదువుకున్న క్లాస్‌మేట్లు ఈ విషయం తెలుసుకున్నారు. తలా కొంత సమకూర్చి నిరుపేద కుటుంబానికి చెందిన మిత్రుడికి రూ.15 వేల సాయాన్ని శుక్రవారం అందజేశారు.

సారపాకలో..

సారపాక, మే 17: బూర్గంపహాడ్ మండలం సారపాక సెయింట్ థెరిసా పాఠశాలలో 2001-02లో టెన్త్ చదువుకున్న జబ్బార్ పక్షవాతం కారణంగా ఇంటికే పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న అతడి టెన్త్ బ్యాచ్‌మేట్స్ రూ.20 వేలు సమకూర్చారు. ఆ మొత్తాన్ని శుక్రవారం జబ్బార్ ఇంటికి వెళ్లి అతడికి అందజేసి స్నేహబంధాన్ని చాటారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పంచామృతాభిషేకం జరుపుతున్న అర్చకులు

పాల్వంచ రూరల్, మే 17: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీకనకదుర్గ అమ్మవారికి అర్చకులు శుక్రవారం పంచామృతాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జన్మస్థలం వద్ద మేళతాళాలతో ప్రత్యేక పూజలు చేసి పసుపు, కుంకుమ, గాజులు, ఒడిబియ్యం సమర్పించారు. పంచహారతుల కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ములకలపల్లి, మే 17: మండలంలోని గుర్రాలకుంట వాగు నుంచి పాల్వంచకు ఇసుకను అక్రమంగాతరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం ఉదయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తారాచందర్ పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్సై రాజమౌళి కేసు నమోదు చేశారు.

హరీశ్ కుటుంబానికి సంతాపం

బూర్గంపహాడ్, మే 17: మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన ఉల్లోజు హరీశ్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు శుక్రవారం హరీశ్ నివాసానికి వెళ్లి అతడి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు సంతాపం తెలిపి సానుభూతి వ్యక్తం చేశారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు కుర్సం వెంకన్న, చిన్న మల్లయ్య, బొందెకోల సహదేవ్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వివాహాలు


సామూహిక వివాహాలు జరిపిస్తున్న దృశ్యం

లక్ష్మీదేవిపల్లి, మే 17 : మండలంలోని హేమచంద్రాపురం గ్రామంలో శ్రీ వాల్మీకి వెంకటేశ్వరస్వామి లక్ష్మీ భూదేవి ఉభయ నాంచారుల కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం సామూహిక వివాహాలు నిర్వహించారు. వికాసతరంగిని కొత్తగూడెంశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండపల్లి సాయిగోపాల్, సుజాత దంపతుల ఆధ్వర్యంలో నిరుపేద జంటలకు వివాహం జరిపించారు. వారికి పట్టువస్త్రాలు, తాలిబొట్లు అందించి వివాహ ఖర్చులు మొత్తం భరించి ప్రతి ఏటా కల్యాణం జరిపిస్తున్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏండ్ల జైలు

కొత్తగూడెం టౌన్, మే 17 : పోక్సో కేసులో వ్యక్తికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... కాళ్లకు పక్షవాతం వచ్చి నడవలేని స్థితిలో ఉన్న బాధితురాలిని ఆమె తల్లిదండ్రులు నాటువైద్యం చేయించేందుకు అమ్మమ్మ నివసిస్తున్న అశ్వాపురం మండలం మంచికంటినగర్‌లో వదిలివెళ్లింది. ఈక్రమంలో బాధితురాలు ఒంటరిగా ఉన్న సమయంలో ఇంటి సమీపంలో ఉండే జవ్వాజి సాంబశివరావు 2021 డిసెంబర్ 30వ తేదీన అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అప్పటి అశ్వాపురం పోలీసు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 12మంది సాక్షుల విచారణ అనంతరం సాంబశివరావుపై నేరం రుజువైనందున 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. బాధితురాలికి పునరావాస పరిహారం కింద రూ.5 లక్షలు చెల్లించే విధంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించగా లైజన్ ఆఫీసర్ హరిగోపాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ మాలోత్ ఈశ్వర్ సహకరించారు.

భారీ వర్షానికి కూలిన దివ్యాంగుడి ఇల్లు

గుండాల, మే 17: గుండాల మండలంలో గురువారం రాత్రి ఏకధాటిగా కురిసిన వర్షానికి పోతురెడ్డిగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఎట్టి అబ్బయ్య ఇల్లు కూలిపోయింది. కేవలం ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్‌తోనే బతుకునీడుస్తున్న అబ్బయ్య పెంకుటిల్లు కూలిపోవడంతో అతడికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు శుక్రవారం ఆ కూలిన ఇంటిని పరిశీలించి అతడిని పరామర్శించారు. ప్రభుత్వం అతడికి ఇల్లు మంజూరి చేసి ఆదుకోవాలని జడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఎంపీపీ ముక్తి సత్యం, మాజీ సర్పంచ్ కోరం సీతారాములు కోరారు.

విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు దాడులు

ఆపరేషన్ 'కగార్' పేరుతో అమానవీయ దాడులను సహించం

దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ పేరుతో లేఖ విడుదల

కొత్తగూడెం క్రైం, మే 17: విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు 'డబుల్ ఇంజిన్' సర్కార్ మైండ్‌గేమ్ ఆడుతోందని, దానిని తప్పకుండా ప్రతిఘటిస్తామంటూ మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ పేరుతో ఓ లేఖ సోషల్ మీడియాలో శుక్రవారం చక్కర్లు కొట్టింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొటేటాంగ్, రాసపల్లి, చందా గ్రామాలపై ఈ నెల 13న రాత్రి డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, కోబ్రా సాయుధ బలగాలు దాడులు చేశాయని ఆరోపించారు. ఆపరేషన్ 'కగార్' పేరుతో సుమారు 1,500 మంది భద్రతా దళాలు విదేశీ సైన్యం మాదిరిగా ఆయా గ్రామాలను ఆక్రమించి దాడులు చేశాయని పేర్కొన్నారు. దాడులు నిర్వహించిన పోలీస్ బలగాలు 38 మందిని చిత్రహింసలు పెట్టి, తీవ్ర పదజాలాలతో దూషించి, బెదిరించి విడుదల చేశారని లేఖలో పేర్కొన్నారు. బొటేటాంగ్‌లో 15 మంది, రాసపల్లి నుంచి 19 మంది, చందా నుంచి ఆరుగురిని మొత్తం 41 మంది గ్రామస్తులను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం పెసా చట్టాన్ని ఒక సజీవ శవంలా పరిగణిస్తూ.. ఇష్టానుసారంగా తన అర్ధబల సైన్యంతో దాడులు చేయిస్తోందని పేర్కొన్నారు. ఈ అమానవీయ దాడులను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని, ప్రజలందరూ తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు.

హిట్ లిస్ట్ విడుదల చేసిన మావోయిస్టులు

గతంలో ఎన్నడూ లేని విధంగా మావోయిస్టు పార్టీ అబూజ్‌మడ్ శివారు ఇంద్రావతి నదీ తీరంలో ఉన్న ఉస్పర్ గ్రామంలో డీఆర్‌జీ జవాన్లను బెదిరిస్తూ పోస్టర్లను విడుదల చేసింది. డీఆర్‌జీ జవాన్లు ఆయా ప్రాంతాల్లోన్ని ఆదివాసీలపై దాడులు చేసినట్లు పోస్టర్లలో పేర్కొంది. అంతేకాక జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ)కి చెందిన పది మంది జవాన్ల పేర్లను వ్యక్తపరుస్తూ ఆ ప్రాంతంలో పోస్టర్లను విడుదల చేయడం సంచలంగా మారింది. దీనిపై అప్రమత్తమైన పోలీస్ అధికారులు దండకారణ్యాన్ని చుట్టుముట్టారు. ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు ప్రభావిత అటవీ ప్రాంతాలను ఎక్కడికక్కడ జల్లెడపడుతున్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

మణుగూరు టౌన్, మే 17: సింగరేణి సేవా సమితి సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మండలంలోని చినరావిగూడెం గిరిజన గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రమణయ్య మాట్లాడుతూ.. సింగరేణి సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్ ఆదేశాల మేరకు వైద్యశిబిరం నిర్వహించి 115 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. స్టాఫ్ నర్స్ సౌందర్యవతి, సిబ్బంది శ్రీకాంత్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలకు 'రేగా' సన్మానం

అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రేగా కాంతారావు

మణుగూరు టౌన్, మే 17: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిలను బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సన్మాంచారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మణుగూరు వచ్చిన వారిని.. స్థానికి తెలంగాణ భవన్‌లో సత్కరించారు. అనంతరం ఎన్నికల ప్రచారం, పార్టీ కార్యాచరణ వంటి అంశాలపై చర్చించారు. బీఆర్ఎస్ నాయకులు కోలేటి భవానీశంకర్, పోశం నర్సింహారావు, వట్టం రాంబాబు, కుర్రి నాగేశ్వరరావు, అడపా అప్పారావు, ముత్యంబాబు, టీబీజీకేఎస్ నాగిల్లి వెంకట్, సకిని బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశానికి వెళ్లిన బీఆర్ఎస్ నేతలు

రేగాతో బూర్గంపహాడ్ మండల బీఆర్ఎస్ నాయకులు

సారపాక, మే 17: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శుక్రవారం మణుగూరులో నిర్వహించిన సన్నాహక సమావేశానికి పార్టీ బూర్గంపహాడ్ మండల నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం అందరమూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. సమావేశానికి తరలిన వారిలో జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీశ్, కొనకంచి శ్రీనివాసరావు, పంగి సురేశ్, సోము లక్ష్మీచైతన్యరెడ్డి తదితరులు ఉన్నారు.

దోస్త్ ఆన్‌లైన్‌కు 29 వరకు గడువు

ఇల్లెందు రూరల్ ,మే 17: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు దోస్త్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఈ నెల 29 వరకు గడువు ఉందని ఇల్లెందు ప్రభుత్వ డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు దోస్త్ కోఆర్డినేటర్ బి.సరితను సంప్రదించవచ్చని సూచించారు.

'పేట'లో పట్టభద్రులు 5,151 మంది

అశ్వారావుపేట, మే 17: ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజవర్గం నుంచి 5,151 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో మహిళలు 2,011 మంది, పురుషులు 3,140 మంది ఉన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో రెండు, ములకలపల్లి, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో ఒక్కొక్కటి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎంపీడీవోకు అస్వస్థత

అశ్వారావుపేట టౌన్, మే 17: అశ్వారావుపేట ఎంపీడీవో జి.శ్రీనివాసరావు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తీవ్రంగా అస్వస్థులయ్యారు. ఆయన శుక్రవారం తోటి అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో బీపీ (రక్తపోటు) పెరగడంతో అలసటకు లోనయ్యారు. సిబ్బంది వెంటనే స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి వైద్యం చేశారు. బీపీ పెరిగిందని చెప్పారు. ఆయనను తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీవో సీతారామరాజు, ఈవో గజవెల్లి హరి కృష్ణతో తదితరులు పరామర్శించారు.

కాంగ్రెస్ కార్యకర్తపై చర్యలకు వినతి

అశ్వారావుపేట, మే 17: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజున బూత్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించి, ఓటరు జాబితాను ఎత్తుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్త మిండా హరిబాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు.

డీసీసీబీ మేనేజర్‌కు సన్మానం

టేకులపల్లి, మే 17: డీసీసీబీ టేకులపల్లి బ్రాంచ్ మేనేజర్ పొదిల వెంకట కృష్ణారావు అశ్వాపురం బదిలీ అయ్యారు, ఆయనను బేతంపూడి సొసైటీ సిబ్బంది శుక్రవారం సన్మానించారు.

'21న జరిగే చలో హైదరాబాద్'

భద్రాచలం, మే 17: టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 21న భద్రాచలం డిపో కమిటీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ బస్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యూనియన్ ఖమ్మం రీజియన్ నాయకులు మాచర్ల సుందరం, భద్రాచలం డిపో కార్యదర్శి బర్ల రమణారావు తెలిపారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలం డిపోలో కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కొత్తగూడెం టౌన్, మే 17 : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో ప్రసూనరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో జరగనుందని, జడ్పీ చైర్మన్, జడ్పీటీసీలు, కో ఆప్షన్ మెంబర్లు, ఎంపీపీలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

కరకగూడెం, మే 17: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతిచెందిన ఘటన మండలంలోని కల్వలనాగారం గ్రామంలో చోటుచేసుకుంది. అదే గ్రామంలోని ఇస్లావత్ రాధాకృష్ణకు చెందిన దుక్కిటెద్దు రోజూలాగే శుక్రవారం కూడా మేతకు వెళ్లింది. ఈ క్రమ